అదే మందు..అదే ధర..

• అందుబాటులోకి రాని నాణ్యమైన మద్యం • రూ.99 క్వార్టర్ ఉత్తిదే..

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

తాము అధికారంలోకి వస్తే నాణ్యమైన మద్యం తక్కువ ధరకే అందిస్తామని చంద్రబాబు నాయుడు ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తరువాత కూడా అదే మాట చెప్పారు. రూ.99కే క్వార్టర్ మద్యాన్ని అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన మద్యం పాలసీ బుధవారం నుంచి అమల్లోకి వచ్చింది. కానీ గతంలో ఉన్న మద్యం, గతంలో ఉన్న ధరకే లభిస్తుండటంతో మందుబాబుల్లో తీవ్ర అసహనం వ్యక్తం అవుతోంది...

ఎన్నికల ప్రచారంలో మాట ఇచ్చినట్లుగానే కూటమి సర్కార్ పాత మద్యం పాలసీని రద్దు చేసి కొత్త మద్యం విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. ఈ షాపులు దక్కించుకునేందుకు పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చాయి. కర్నూలు జిల్లాలో 99 మద్యం దుకాణాలను, నంద్యాల జిల్లాలో 105 మద్యం దుకాణాలను ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా 204 మద్యం దుకాణాలను లాటరీ ద్వారా కేటాయించారు. బుధవారం నుంచి కొత్త దుకాణాలు ప్రారంభమయ్యాయి. శుక్రవారానికి నంద్యాల జిల్లాలో ఆత్మకూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఆరు దుకాణాలు, కర్నూలు జిల్లాలో 12 దుకాణాలు మినహా మిగిలిన అన్ని దుకాణాలు తెరచుకున్నాయి. గతంలో చంద్రబాబు హామీ ఇచ్చినట్లుగా అన్ని రకాల నాణ్యత గల బ్రాండ్లు అందుబాటులో ఉంటాయని, ధరలు తగ్గుతాయని ఆశించిన మందుబాబులు భంగపాటుకు గురయ్యారు. తమకు నచ్చిన బ్రాండ్ల కోసం ఎదురు చూసిన మద్యం ప్రియులు నిరాశకు గురయ్యారు. 2019 నుంచి నిన్న, మొన్నటి వరకూ దొరికిన బ్రాండ్లే కొత్త మద్యం పాలసీ వచ్చిన తర్వాత కూడా ప్రస్తుతం దొరుకుతుండడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పైగా మద్యం ధరలు భారీగా తగ్గుతాయని చంద్రబాబు ప్రకటించినప్పటికీ పాత ధరలే అమలవుతున్నాయి. మద్యపాన నియంత్రణ పేరుతో వైసిపి సర్కారు మద్యం షాపులను ప్రభుత్వమే నిర్వహించేలా పాలసీను అమలు చేసింది. ధరలను భారీగా పెంచి విక్రయించింది. క్రమంగా

మద్యాన్ని దూరం చేయాలనే ఆలోచనలో భాగంగానే ధరలు పెంచామంటూ చెప్పొకొచ్చింది. చాలా వరకూ పాత బ్రాండ్లను పూర్తిగా పక్కన పెట్టి కొత్త బ్రాండ్లను తీసుకొచ్చి విక్రయాలు జరిపింది. నాసిరకం బ్రాండ్లపై మందుబాబుల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఈ నేపథ్యంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబు వైసిపి అమలు చేసిన మద్యం పాలసీని తీవ్రస్థాయిలో విమర్శించారు. మందు బాబులను ఆకట్టుకునే పనిలో భాగంగా తాము అధికారంలోకొచ్చిన వెంటనే నాణ్యమైన మద్యాన్ని అందుబాటులోకి తెస్తామని చెప్పారు. అనుకున్నట్టే నూతన మద్యం పాలసీని తీసుకొచ్చి ప్రయివేటు దుకాణాలు ఏర్పాటు చేయించారు. తీరా చూస్తే నాణ్యమైన మద్యం గానీ, అన్ని రకాల బ్రాండ్లు అందుబాటులోకి రాకపోవడంతో మందు బాబులు షాక్‌కు గురయ్యారు. పైగా పాత ధరలకే మద్యం విక్రయించాలని ప్రభుత్వం చెబుతోంది. ఈ నేపథ్యంలో మద్యం ధరలు తగ్గాయనుకుని దుకాణాలకు వస్తున్న వారికి నిరాశ తప్పలేదు. మద్యం ధరల్లో ఎలాంటి మార్పు లేకపోవడంతో పలు చోట్ల విక్రేతలతో వాగ్వాదానికి దిగుతున్నారు. రూ.99కే మద్యం జిల్లాలో ఎక్కడా అందుబాటులోకి రాలేదు. రూ.130 కనీస ధర ఉన్న రకమే చాలా చోట్ల విక్రయిస్తున్నారు. మద్యం వ్యాపారులకు 20 శాతం మార్జిన్ ఇస్తున్నట్లు మాత్రం ప్రభుత్వం చెబుతోంది. ఆ మేరకు విక్రయాలు సైతం జరుగుతున్నాయి. అయితే పాత ధరలు, పాత బ్రాండ్లు ఎప్పటి వరకూ కొనసాగుతాయనేది ప్రస్తుతానికి స్పష్టత లేదు.

ట్రాక్టర్లలోనూ తీసుకెళ్లొచ్చు..!

• ఉచిత ఇసుక విధానంలో మార్పులు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానంలో మార్పులు తీసుకొచ్చింది. వ్యక్తిగత అవసరాల కోసం రీచ్‌ల నుంచి ఇసుకను ఎద్దుల బండ్లలో ఉచితంగా తీసుకెళ్లేందుకు అనుమతి ఉండగా ట్రాక్టర్లలో కూడా ఉచితంగా ఇసుకను తీసుకెళ్లేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ మేరకు గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ముకేష్ కుమార్ మీనా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక పేరుతో నూతన ఇసుక పాలసీని తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రస్తుతం ఐదు డీ సిల్టింగ్ పాయింట్ల ద్వారా కొనుగోలుదారులకు ఇసుకను అందిస్తున్నారు. సి.బెళగల్ మండలంలోని కె.సింగవరం, ముడుమాల, ఈర్లదిన్నె, కొత్తకోట, గుండ్రేవులలో ఇసుక డీ సిల్టింగ్ పాయింట్లను ఏర్పాటు చేశారు. వాటి ద్వారా ఇసుక రవాణా సాగుతోంది. వ్యక్తిగత అవసరాల కోసం ఇప్పటి వరకూ రీచ్‌ల నుంచి ఇసుకను ఎద్దుల బండ్లలో ఉచితంగా తీసుకెళ్లేందుకు అనుమతి ఉండగా ట్రాక్టర్లలో కూడా ఉచితంగా ఇసుకను తీసుకుని వెళ్లవచ్చని ఆదేశాలు ఇవ్వడంతో సొంతంగా ట్రాక్టర్లు ఉండి ఇసుక తెచ్చుకోవాలనుకునే వారికి కాస్త వెసులుబాటు కలగనుంది. ప్రస్తుతం 20 కిలోమీటర్ల వరకు 4.5 టన్నులు ఇసుక పట్టే ట్రాక్టర్‌కు రూ.1400 అదనంగా చెల్లించాల్సి ఉండేది. అయితే ఇసుకను రవాణా చేసే వాహనాల యజమానులు ప్రభుత్వం నిర్ణయించిన రవాణా ఛార్జీల కన్నా అదనంగా రవాణా ఛార్జీని వసూలు చేస్తున్నారు. 20 కిలోమీటర్ల లోపు ఇసుక రవాణాకు రూ.1900 నుంచి రూ.2వేలు వసూలు చేస్తున్నారు. ఈ అదనపు భారం తగ్గనుందని పలువురు అధికారులు చెబుతున్నారు.

మహిళా హమాలీ కార్మికులకు లైసెన్సులు ఇవ్వాలి

- మార్కెట్ యార్డ్ కార్యదర్శికి సిఐటియు వినతి

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

మార్కెట్‌లో మహిళా హమాలి కార్మికులకు లైసెన్స్‌లు ఇవ్వాలని శుక్రవారం కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డు సెలక్షన్ గ్రేడ్ కార్యదర్శి జయలక్ష్మికి సిఐటియు జిల్లా శ్రామిక మహిళా సంఘం జిల్లా కార్యదర్శి పి.నిర్మల, సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, నగర అధ్యక్ష కార్యదర్శులు ఆర్.నరసింహులు, సిహెచ్.సాయి బాబా, మార్కెట్ యార్డు యూనియన్ల గౌరవ అధ్యక్షుడు టి.రాముడు, సిపిఎం ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం.రాజశేఖర్, జనార్ధన్‌రావు, మార్కెట్ యార్డ్ యూనియన్ కార్యదర్శి భీసన్న లు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్కెట్ యార్డులో ఉన్న కొన్ని సమస్యలను సెక్రటరీ జయలక్ష్మితో చర్చించి వివరించారు. మార్కెట్ యార్డులో పనిచేస్తున్న మహిళ హమాలీ కార్మికులకు ఏళ్ల తరబడి పనిచేస్తున్నా ఎలాంటి గుర్తింపు లేదని అన్నారు. వారు చనిపోతే ఎలాంటి నష్టపరిహారాలు అందడం లేదని, మహిళా కార్మికులకు పనిచేస్తున్నట్టుగా లైసెన్స్ ఇవ్వాలని కోరారు. మహిళల మరుగుదొడ్ల సమస్యను పరిష్కరించాలని, కార్మికులకు నీటి సౌకర్యం కల్పించాలని కోరారు. తమ దృష్టికి తెచ్చిన సమస్యలను పరిష్కరిస్తానని కార్యదర్శి జయలక్ష్మి హామీ ఇచ్చారు. హమాలి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కార్యదర్శి జయలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మున్సిపల్ టీచర్ల పట్ల వివక్ష తగదు

- రాష్ట్ర సహాధ్యక్షుడు కె. సురేష్ కుమార్
కలెక్టరేట్ ఎదుట యుటిఎఫ్ నిరసన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం పట్ల రాష్ట్ర ప్రభుత్వ వివక్ష తగదని యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్ విమర్శించారు. ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట యుటిఎఫ్ నగర కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. జిల్లా కార్యదర్శి ఇబ్రహీం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.నవీన్ పాటి మట్లాడారు. స్వాతంత్ర్యం రాకముందు మున్సిపల్ పాఠశాలలు ద్వారా విద్యాబోధన అందుతుండేదని అన్నారు. ఇప్పుడు మున్సిపల్ పాఠశాలలను కూడా ప్రభుత్వ విద్యాశాఖలో విలీనం చేసినా సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. అనేక మున్సిపల్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉంద న్నారు. వెంటనే వారికి పదోన్నతుల ను చేపట్టాలని డిమాండ్ చేశారు. వీటితోపాటు ఇతర సమస్యలను కూడా పరిష్కరించాలన్నారు. రాష్ట్రం లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యాశాఖను గాలికి వదిలేసిందన్నారు. మానవ వనరుల శాఖ మంత్రి నారాలోకేష్ కూడా పట్టించుకోవడం లేదన్నారు. సార్వత్రిక ఎన్నికల ముందు జిఒ నెంబర్ 117ను రద్దు చేస్తానని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక పట్టించుకోవడం లేదన్నారు. గత ప్రభుత్వం జిపిఎస్ చేసిన చట్టానికి గజిట్ నోటిఫికేషన్ ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. దీనిపై యుటిఎఫ్ పోరాటం చేయడంతో జిపిఎస్‌ను నిలుపుదల చేశారన్నారు. ఈ నిరసన శిబిరం దగ్గరకు జిల్లా విద్యాశాఖ అధికారి కె శామ్యూల్ వచ్చి యుటిఎఫ్ ప్రతినిధుల నుండి వినతి పత్రాన్ని స్వీకరించారు. ఈ సమస్యలన్నిటిని రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ జయరాజు, నగర నాయకులు సర్వేశ్వర్ రెడ్డి, వెంకటనారాయణ, జగదీష్, వెంకటేశ్వర్లు, రమేష్ నాయుడు, రఫిక్, రెహమాన్ పాల్గొన్నారు.

నిరసననుద్దేశించి మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు సురేష్‌కుమార్

విద్యుత్ చార్జీల భారం ఆలోచన ఉపసంహరించకపోతే

మరో విద్యుత్ ఉద్యమం

• రాష్ట్ర ప్రభుత్వానికి సిపిఎం హెచ్చరిక

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

టిడిపి కూటమి ప్రభుత్వం ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో రూ. 8114 కోట్ల విద్యుత్ భారాన్ని ప్రజలపై వేయడాన్ని ఉపసంహరించకపోతే మరో విద్యుత్ ఉద్యమాన్ని చేపడతామని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని విద్యుత్ కార్యాలయం ముందు విద్యుత్ నియంత్రణ మండలి చేపడుతున్న అభిప్రాయ సేకరణకు వ్యతిరేకంగా కర్నూలు నగరంలోని బళ్లారి చౌరస్తాలోని విద్యుత్ సౌధ కార్యాలయం ముందు సిపిఎం న్యూ సిటీ కార్యదర్శి టి రాముడు అధ్యక్షతన నిరసన తెలిపారు. డి.గౌస్ దేశాయ్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారంలో రాకముందు వైసిపి ప్రభుత్వం వేసిన విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా బాదుడే బాదుడు అనే కార్యక్రమాన్ని చేపట్టారని, అధికారంలోకి రాగానే అదే భారాన్ని ప్రజలపై వేయాలనుకోవడం దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. చంద్రబాబు ద్వంద వైఖరికి ఇది నిదర్శనమని అన్నారు. విద్యుత్ సంస్థను మూడు ముక్కలుగా చేసి ప్రపంచ బ్యాక్ షరతులను అమలు చేసిన వ్యక్తి చంద్రబాబు నాయుడు అని విమర్శించారు. గతంలో ఉన్న స్లాబ్ సిస్టం కూడా మార్చి కొత్త స్లాబ్ రేటును అమలు చేసి ప్రజలు విద్యుత్తు వాడకపోయినా భారం పడేలా చేశారని తెలిపారు. 2022 - 23 సంవత్సరంలో ప్రజలు వాడిన విద్యుత్ పై ట్రూఅప్ చార్జీల పేరుతో. రూ. 8 వేల కోట్లకు పైగా భారాలు వేయడం సరైన పద్ధతి కాదని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ నియంత్రణ మండలి ఆన్ లైన్‌లో తూతూ మంత్రంగా ప్రజాభిప్రాయ సేకరణ చేసి విద్యుత్ భారాన్ని ప్రజలపై వేయడానికి మార్గాన్ని ఏర్పాటు చేసుకుంటున్నారని విమర్శించారు. భారాలు వేసినప్పుడల్లా ఇదే తంతు ప్రదర్శించడం సరైన పద్ధతి కాదని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తన ఆలోచనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నిర్మల మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు మోసకారి అని ప్రజలను మోసం చేయడమే ఆయన పని అని విమర్శించారు. చంద్రబాబు నాయుడుకు ధైర్యం ఉంటే ఎన్నికల ముందు ఈ విషయాన్ని చెప్పి ఓట్లు అడిగి ఉండాల్సిందని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తన తంతును ఆపి విద్యుత్ భారాలు ప్రజలపై వేయకుండా నివారించాలన్నారు. విద్యుత్ సంస్థపై పడిన రూ.8 వేల కోట్లను ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. అనంతరం టెక్నికల్ డిఇకి వినతిపత్రం ఇచ్చారు. ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం రాజశేఖర్ మాట్లాడుతూ తక్షణమే ప్రభుత్వం తన ఆలోచనలను ఉపసంహరించకపోతే మరో విద్యుత్ ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. సిపిఎం జిల్లా నాయకులు పిఎస్.రాధాకష్ణ, ఎండి.ఆనంద్ బాబు, సుభాన్, సాయిబాబా సుధాకరప్ప, నరసింహ, షరీఫ్, అబ్దుల్లా, రామకృష్ణ, కృష్ణ పాల్గొన్నారు.

నిరసననుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్

విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేస్తున్న లీలా వెంకటశేషాద్రి, సామ్యూల్‌పాల్

మెనూ తప్పనిసరిగా పాటించాలి

ప్రజాశక్తి-కర్నూల్ కలెక్టరేట్

విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన పథకంలో తప్పనిసరిగా మెనూ పాటించాలని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి పాఠశాల విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సామ్యూల్ పాల్ హెచ్‌ఎంలను ఆదేశించారు. శుక్రవారం రెండో రోజు కర్నూలు నగరంలోని దామోదరం సంజీవయ్య , డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలుతీరును వారు పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి వారు భోజనం చేసి నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని వారు కోరారు.

ఇరిగేషన్ ఎస్ఇ గా బాధ్యతలు స్వీకరించిన బాలచంద్రారెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

జలవనరుల శాఖ-లో పనిచేస్తున్న వివిధ జిల్లాల సూపరింటెండెంట్ ఇంజనీర్లను బదిలీ చేస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎస్ఇలు లేని జిల్లాల్లో డిప్యూటీ ఎస్ఇ, ఇఇలకు పూర్తి అదనపు బాధ్యత (ఎఫ్ఎసీ) లు అప్పగించారు. కర్నూలు ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఇగా డిప్యూటీ ఎస్ఇ బి. బాలచంద్రారెడ్డికి పూర్తి అదనపు బాధ్యతలు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇగిరేషన్ సర్కిల్ ఎస్ఇ(ఎస్ఏసీ)గా పని చేస్తున్న రెడ్డి రెడ్డి శేఖర్‌రెడ్డిని అనంతపురం జిల్లా హెచ్ఎల్‌సి డివిజన్ ఇఇగా గత నెల 26 బదిలీ చేశారు. ప్రస్తుత ఎస్ఇ బాలచంద్ర రెడ్డి కడప జిల్లా మైదుకూరుకు చెందిన ఆయన 1989లో ఎఇగా జలవనరుల శాఖలో ఉద్యోగంలో చేరారు. బ్రహ్మంగారి మఠం దగ్గర ఉన్న తెలుగుగంగ బ్రహ్మంసాగర్‌లో విధులు చేపట్టారు. 2002లో డిఇఇగా పదోన్నతి వచ్చింది. అన్నమయ్య

ప్రాజెక్టు (చెయ్యేరు), గండికోట ప్రాజెక్టుల్లో, ప్రొద్దుటూరు ఎంఐ డిఇఇగా పని చేశారు. 2013లో ఇఇగా పదోన్నతి వచ్చింది. నంద్యాల కెసి కెనాల్ డివిజన్, తెలుగుగంగా డివిజన్, ఎంఐ డివిజన్‌లో పని చేశారు. 2019లో కడప మైనర్ ఇరిగేషన్ (ఎంఐ) ఇఇగా బదిలీపై వెళ్లారు. నాటి నుంచి అక్కడే పని చేస్తున్న బాలచంద్రారెడ్డి గత నెలలో జరిగిన బదిలీల్లో కర్నూలు ఇరిగేషన్ సర్కిల్ డిప్యూటీ ఎస్ఇగా బదిలీపై వచ్చారు. ఆయనకే ఎస్ఇగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శుక్రవారం కర్నూలు సర్కిల్ కార్యాలయంలో ఎస్ఇగా బాలచంద్రరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు ఎస్ఇగా ఎఫ్ఎసి ఇవ్వడం మరింత బాధ్యత పెరిగిందని, కరువు జిల్లాలో రైతులకు సాగునీరు అందించడమే కాకుండా కొత్త ప్రాజెక్టుపై అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపుతానని, కింద స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు వివిధ హోదాల్లో పని చేసే ఇంజనీర్లు, ఉద్యోగులను సమన్వయం చేసుకొని సమిష్టిగా పని చేస్తూ రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం సిఇ కబీర్ బాషను మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందించారు.

అంతర్జాతీయ సంస్థకు గౌరవ అధ్యక్షుడిగా డాక్టర్ రాయపాటి శ్రీనివాస్

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్

నైస్ యూత్ ఫర్ కల్చర్ అండ్ ఎడ్యుకేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్‌కు ఐరోపా ఖండానికి క్రొయేషియా దేశానికి చెందిన బాల్కనోఫంటాస్టిక అంతర్జాతీయ సంస్థకు గౌరవ అధ్యక్షుడిగా అరుదైన గౌరవం దక్కింది. ఒక్కో దేశం నుండి ఒక గౌరవాధ్యక్షుడు ఎన్నిక జరగగా అందులో భారతదేశం నుండి లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్‌కు భారతదేశం నుండి అంతర్జాతీయ సంస్థకు గౌరవ అధ్యక్షుడిగా అవకాశం దక్కింది. గతఐదు సంవత్సరాలుగా బాల్కనోఫంటాస్టిక సంస్థ నిర్వహించే అంతర్జాతీయ సదస్సులు తదితర కార్యక్రమాలలో పాలుపంచుకోవడం వల్ల ఈ అవకాశం దక్కడం సంతోషంగా ఉందని లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ తెలిపారు.

ఆర్‌టిసికి రూ.72 లక్షల ఆదాయం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : దసరా పండగ సందర్భంగా ప్రయాణికులు , తిరిగి తమ ప్రాంతాలకు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన బస్సుల ద్వారా ఆర్‌టిసికి రూ. 72 లక్షల ఆదాయం వచ్చినట్లు డిప్యూటీ ట్రాఫిక్ చీఫ్ మేనేజర్ కె.సుధారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దసరా పండుగను పురస్కరించుకొని సొంత ఊళ్లకు వెళ్ళగోరు ప్రయాణీకుల సౌకర్యార్థం హైదరాబాదు, బెంగుళూరు, తిరుపతి, చెన్నై , విజయవాడ నగరాల నుండి కర్నూలుకు వచ్చు ప్రయాణీకుల కోసం ఈనెల 8 నుంచి 11 వరకు, తిరుగు ప్రయాణమై వెళ్ళు ప్రయాణీకుల సౌకర్యార్థం కర్నూలు నుండి హైదరాబాదు, బెంగుళూరు, తిరుపతి, చెన్నై , విజయవాడ నగరాలకు ఈనెల 13 నుంచి 16 వరకు మొత్తం 258 ప్రత్యేక బస్సులను, షెడ్యూలు బస్సులకు అదనంగా నడిపామని పేర్కొన్నారు. మొత్తం మీద రూ.1 లక్షా 63 వేల కిలో మీటర్లు నడిపి, 76శాతం ఆక్యుపెన్సీ రేషియోతో, రూ.44.00 ఇపికె (ఒక కి.మీ.కు వచ్చిన ఆదాయం) తో రూ.72 లక్షల ఆదాయాన్ని ఆర్జించినట్లు పేర్కొన్నారు. గత సంవత్సరంతో పోలిస్తే, రూ.7 లక్షలు అదనంగా ఆర్జించామని పేర్కొన్నారు. సాధారణ చార్జీలతో స్పెషల్ బస్సులను నడిపినా ఆర్‌టిసిని ఆదరించిన ప్రయాణీక దేవుళ్ళకు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు మరమ్మతుకోసం సిపిఎం ధర్నా

ప్రజాశక్తి-తుగ్గలి

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న జి.రామకృష్ణ

తుగ్గలి మండలం జి ఎర్రగుడి గ్రామంలో గుత్తి -పత్తికొండ రోడ్డుపై రోడ్డు మరమ్మతు వెంటనే చేయాలని సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి రామకృష్ణ మాట్లాడుతూ ఈరోజు నామ మాత్రంగా మాత్రమే ధర్నా చేస్తున్నామని, ఒక్క వారం రోజుల్లో మరమ్మతులు చేయకపోతే గ్రామంలో ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున రోడ్డును దిబ్బంధం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సిపిఎం మండల కన్వీనర్ శ్రీరాములు, నాయకులు కొండారెడ్డి, సుబ్బారెడ్డి, ఎర్రగుడి, సిపిఎం శాఖ కార్యదర్శి బలరాముడు, ఇతర నాయకులు ఆంజనేయులు,గ్రామ ప్రజలు శివప్ప, శ్రీనివాసులు, భీమన్న .లక్ష్మన్న మసాలా భీమన్న, హేమల నాయక్, లక్ష్మణ్ నాయక్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లోనే రవాణా శాఖ సేవలు

కర్నూలు ఆర్‌టిఓ భరత్ చవాన్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

రవాణా శాఖకు సంబంధించిన అన్ని రకాల పౌర సేవలు ఆన్‌లైన్‌లో పొందవచ్చని కర్నూలు రవాణా శాఖ ప్రాంతీయ అధికారి భరత్‌చవాన్ తెలిపారు. గత నెలాఖరులో భరత్ చవాన్ బాధ్యతలు స్వీకరించారు. 2023లో గ్రూప్-1 ద్వారా ఎంపికై ఆర్టీఓ హోదాలో రవాణా శాఖలో చేరి మొదటి పోస్టింగ్ రాయచోటిలో చేశారు. రాయచోటి నుంచి ఇటీవల జరిగిన బదిలీల్లో కర్నూలుకు వచ్చారు. ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో వచ్చిన ప్రతి దరఖాస్తును ఎంవిఐలు పరిశీలించి, ఆన్‌లైన్‌లోనే అప్రూవ్ చేస్తారని తెలిపారు. కర్నూలు పరిధిలో రోడ్డు రవాణా సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు.

కతార్ సాహితీ సదస్సుకు ఫామిదా బేగంకు ఆహ్వానం

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

కతార్ రాజధానిలో నవంబర్ 22,23 తేదీలలో జరిగే ప్రపంచ తెలుగు చాహితీ సదస్సుకు సిల్వర్ జూబ్లీ కళాశాల తెలుగు భాష అధ్యాపకురాలు ఫామిదాబేగం నిర్వాహకులు ఆహ్వాన లేఖను పంపారు. శుక్రవారం అధ్యాపకురాలిని క్లస్టర్ వర్సిటీ విసిసాయి గోపాల్‌తో పాటు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బివి సుబ్రహ్మణ్య కుమార్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బిఆర్ ప్రసాద్ రెడ్డి లతోపాటు ఇతర అధ్యాపకులు అభినందించారు.

మైనర్ ఇరిగేషన్ డిఇఇగా నాగరాజు బాధ్యతలు

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్



కర్నూలు మైనర్ ఇరిగేషన్ డిఇఇగా నాగరాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు డివిజన్ పరిధిలో ఉండే పనులకు తమవంతు కృషిని అందిస్తామని తెలిపారు. సబ్‌డివిజన్ పరిధిలో ఉండే ఐదు మండలాలు, 26 చేరువులకు సంబంధించిన పనులకు పలు రకాల మరమ్మతులు చేయడానికి నిధులు మంజూరు అయ్యాయని వాటికి షెట్టర్లు ,గబ్లిష్ రిపేర్ లు చేయిస్తామన్నారు.

సంగాల, తిమ్మందొడ్డి, యనగండ్లలో పల్లెపండుగ

ప్రజాశక్తి- సి బెళగల్ : మండలంలోనీ మూడు గ్రామాల్లో ఎంపిడిఒ రాణెమ్మ, ఎపిఒ రామన్న లు శుక్రవారం సర్పంచులు ఎమ్మానియేలు, హనుమంతు, చిన్న రంగమ్మల సమక్షంలో పల్లెపండుగ నిర్వహించారు. ఇక్కడే సిసి రోడ్లకు భూమి పూజ నిర్వహించి ప్రజలకు అవసరసరమైన అభివృద్ధి పనులు చేయడమే పల్లెపండుగ అని పేర్కొన్నారు.

నేరాల నియంత్రణకు చర్యలు

- జొన్నగిరి పిఎస్ రికార్డులను పరిశీలించిన : ఎస్‌పి

ప్రజాశక్తి-తుగ్గలి

వార్షిక తనిఖీలో భాగంగా జొన్నగిరి పోలీసు స్టేషన్‌లో ఎస్‌పి జి.బిందు మాధవ్ శుక్రవారం రికార్డులను పరిశీలించారు. నమోదైన కేసుల్లో పెండింగ్ వాటి స్థితిగతులు, నిందితుల అరెస్టు, కేసుల దర్యాప్తు తీరుతెన్నులు వాటి పురోగతి పై కేసుల ఫైళ్ళను క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యమైన కేసులు, పాత గ్రేవ్, ఎక్సైజ్ కేసులను సమీక్షించారు. ఎక్కువగా విజిబుల్ పోలీసింగ్ చేయాలని, సమర్ధవంతమైన నేర నియంత్రణ, నివారణ చర్యలు చేపట్టాలన్నారు. పోలీసు స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

బాధితులు పోలీసుస్టేషన్‌ను ఆశ్రయించి నప్పుడు వారి సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. పత్తికొండ డిఎస్‌పి వెంకట్రామయ్య , ట్రైనీ డిఎస్‌పి ఉష శ్రీ, సిఐలు ప్రసాద్, గుణశేఖర్ బాబు, పులిశేఖర్, జొన్నగిరి ఎస్ఐ జయశేఖర్ ఉన్నారు.

21 నుండి ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లింపు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : ఇంటర్మీడియట్ రెగ్యులర్ , సప్లమెంటరీ విద్యార్థులు మార్చిలో జరిగే సార్వత్రిక పరీక్షల ఫీజు చెల్లించేందుకు ఈనెల 21నుండి కళాశాలలో విద్యార్థులు చెల్లించాలని ఆర్ఐఒ ఎస్‌విఎస్ గురువయ్యాశెట్టి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నవంబర్ 11 వరకు గడువు ఉంటుందన్నారు.రూ.వెయ్యి అపరాధ సుంకంతో నవంబర్ 20 వరకు గడువు ఉంటుందన్నారు.

మద్యం దుకాణం ఏర్పాటును ఆపాలి

- డిప్యూటీ తహశీల్దార్‌కు ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ వినతి

ప్రజాశక్తి - ఆలూరు

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆలూరు, అరికెర రోడ్డు మార్గంలో బీసీ బాలుర హాస్టల్, బీసీ మేనేజ్‌మెంట్ కళాశాల బాలుర హాస్టల్ దగ్గర మద్యం దుకాణం ఏర్పాటును ఆపాలని ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ నాయకులు కోరారు. శుక్రవారం ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో డిప్యూటీ తహశీల్దార్ విజయ్ కుమార్‌కు, ఎక్సైజ్ ఎస్ఐ నవీన్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్‌ఐ మండల కార్యదర్శి మైనా, ఎస్‌ఎఫ్‌ఐ మండల అధ్యక్షులు ఉమేష్ మాట్లాడారు. ఆలూరులోని అరికెర రోడ్డులో ఉన్న బీసీ బాలుర హాస్టల్‌లో 6 నుంచి 10వ తరగతి వరకు వందమందికి పైగా విద్యార్థులు ఉన్నారని తెలిపారు. బీసీ మేనేజ్‌మెంట్ కళాశాల బాలుర హాస్టల్‌లో ఇంటర్మీడియేట్, డిగ్రీ, ఐటిఐ, పాలిటెక్నిక్ కళాశాలలో చదివే పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులు వసతి పొందుతూ విద్యనభ్యసిస్తున్నారని చెప్పారు. దగ్గరలోనే ప్రతి ప్రైవేట్ స్కూల్ ఉందన్నారు. ఈ ప్రాంతంలో నూతనంగా మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేస్తుండడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. గుడి, బడి వసతి ప్రాంతాల్లో మద్యం దుకాణాలు ఏర్పాటు చేయకూడదని నిబంధనలో ఉన్నా అతిక్రమించి మద్యం దుకాణం ఏర్పాటు చేయడం సరైంది కాదన్నారు. వసతి గృహాల పరిధిలో మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, లేకపోతే విద్యార్థులతో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. డివైఎఫ్‌ఐ మండల ఉపాధ్యక్షులు గోవర్ధన్, నాయకులు అఖిల్ నందన్, రాజశేఖర్, ఎస్‌ఎఫ్‌ఐ మండల ఉపాధ్యక్షులు మణి, నాయకులు వీరేష్ పాల్గొన్నారు.

డ్రెయినేజీ, సిసి రోడ్ల నిర్మాణం చేపట్టాలి

- సబ్ కలెక్టర్‌కు బీసీ కాలనీ వాసుల వినతి

ప్రజాశక్తి - హొళగుంద

మండలంలోని ఇంగలదహాల్ గ్రామ బీసీ కాలనీలో డ్రెయినేజీ, సిసి రోడ్ల నిర్మాణం చేపట్టాలని కాలనీ వాసులు కోరారు. శుక్రవారం గ్రామానికి వచ్చిన ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం అందజేశారు. కాలనీలోని యువకులు మాట్లాడుతూ... బీసీ కాలనీలో వర్షం నీరే కాదు, వాడుకున్న డ్రెయినేజీ నీరు వెళ్లడానికి కూడా వీల్లేకుండా అన్ని రోడ్లపైనే నిల్వ ఉంటున్నాయని తెలిపారు. సిసి రోడ్లు కూడా లేకపోవడంతో నడవడానికి ఇబ్బంది పడుతున్నామని చెప్పారు. అలాగే ప్రధాన రహదారి నుంచి కాలనీలోకి సిసి రోడ్లు లేక వర్షాలు వస్తే కాలనీల్లోకి వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. పాఠశాలకు వెళ్లే విద్యార్థులు అందులో పడిపోతున్నారని, అధికారులకు చెప్పినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సబ్ కలెక్టర్ స్పందిస్తూ... 15 రోజుల్లో సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీఇచ్చారు. బీసీ కాలనీ యువకులు పి.రాజు, మల్లికార్జున, పంపాపతి, రాజు పాల్గొన్నారు.

వైద్య కళాశాల పనులు ప్రారంభించాలి

- ఎమ్మెల్యేకు విద్యార్థి, యువజన సంఘాల వినతి

ప్రజాశక్తి - చిప్పగిరి

ఎమ్మెల్యే విరుపాక్షికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆదోనిలో నిర్మిస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాల పనులను వెంటనే పునః ప్రారంభించాలని విద్యార్థి, యువజన సంఘాల జెఎసి నాయకులు కోరారు. శుక్రవారం ఆలూరు ఎమ్మెల్యే బి.విరుపాక్షిని చిప్పగిరి స్వగృహంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జెఎసి కన్వీనర్ శ్రీనివాసులు, నాయకులు సోమశేఖర్, దస్తగిరి, ఉదయ్, రమేష్, శశి మాట్లాడారు. వైద్య కళాశాల పనులు అర్ధాంతరంగా ఆగిపోవడం వల్ల ఈ ఏడాది ప్రారంభం కావాల్సిన అడ్మిషన్లు నిలిచిపోయాయని తెలిపారు. పనులు పూర్తయితే పశ్చిమ ప్రాంత నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కళాశాల పనులను ప్రారంభించాలని కోరారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని విరుపాక్షి హామీఇచ్చారు.

'జిల్లా మహాసభలు జయప్రదం చేయండి'

ప్రజాశక్తి - దేవనకొండ

నవంబర్ 12, 13న ఆదోని పట్టణంలో నిర్వహించే ఎఐఎస్‌ఎఫ్ జిల్లా 30వ మహాసభలను జయప్రదం చేయాలని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు డి.సోమన్న, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.శరత్ కుమార్, ఎఐఎస్‌ఎఫ్ మాజీ నాయకులు ఎం.నరసరావు కోరారు. శుక్రవారం స్థానిక వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో సమావేశం నిర్వహించారు. వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం ఎఐఎస్‌ఎఫ్ మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా మధు, కార్యదర్శిగా భాస్కర్, ఉపాధ్యక్షులుగా రవి, మల్లి, చరణ్య, ఉమేష్, సహాయ కార్యదర్శులుగా రాజు, కల్యాణ్, రవితేజతో పాటు మరో 12 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఆదోనిలో భారీ వర్షం

● ప్రధాన రహదారులు జలమయం.. ● తీవ్ర ఇబ్బందులు పడిన జనం...

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలో శుక్రవారం సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు భారీ వర్షం కురిసింది. ఏకధాటిగా రెండు గంటల పాటు భారీ వర్షం కురవడంతో పట్టణంలోని ప్రధాన రహదారులు, ఆయా కాలనీల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీనికి తోడు గత రెండు రోజులుగా పట్టణంలో వర్షం కురిసింది. ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో వడ్డెగేరి, శివశంకర్ నగర్, అమరావతి ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ప్రధాన రోడ్డులోనూ, కాలనీలలోనూ రోడ్లపై ఉంచిన వాహనాలన్నీ నీట మునిగాయి. వివిధ పనుల నిమిత్తం బయటకొచ్చిన పట్టణ ప్రజలు, ఇతర ప్రాంతాల నుంచి పట్టణానికి వచ్చిన గ్రామీణ ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వర్షపు నీరు భారీగా చేరడంతో పట్టణంలోని శ్రీనివాస్ భవన్ సర్కిల్, భీమాస్ సర్కిల్, ఎంఎం రోడ్డు, పిఎన్ రోడ్డు, ఝాన్సీ లక్ష్మీ మార్కెట్ ప్రాంతం, ప్రభాకర్ టాకీస్ ప్రాంతంలో భారీగా వర్షపు నీరు చేరి రోడ్లన్నీ జలమయమయ్యాయి. రోడ్లపై ఉంచిన ద్విచక్ర వాహనాలు, తోపుడు బండ్లు వర్షపు నీటిలో మునిగాయి. అలాగే ఇతర వస్తువులు సైతం వర్షపు నీటిలో కొట్టుకుపోయాయి. ప్రధాన రహదారిలోనే నడుము లోతు వర్షపు నీరు నిలవడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పాత ఓవర్ బ్రిడ్జి నుంచి భీమాస్ సర్కిల్ వరకు భారీగా వర్షపు నీరు నిలవడంతో, రోడ్డు పక్కన ఉన్న దుకాణాల్లోకి వర్షపు నీరు చేరడంతో, నడుము లోతు వర్షపు నీరు రోడ్లపై నిలవడంతో ప్రజలు దుకాణాల నుంచి బయటికి రాలేకపోయారు.

స్తంభించిన ట్రాఫిక్

పాఠశాలలు వదిలే సమయంలో వర్షం కురవడంతో విద్యార్థులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. శ్రీనివాస భవన్ వద్ద మోకాళ్ల లోతు నీరు నిలవడంతో అటువైపు వెళ్లే వాహనాల రాకపోకలు స్తంభించడంతో భీమాస్ సర్కిల్ వరకు బారులు తీరాయి. వర్షపు నీరు రోడ్లపై నిలవడంతో పాదచారులు ఇబ్బందులు పడ్డారు. మురుగునీరు రోడ్లపై నిలవడంతో దుర్వాసన వెదజల్లింది. మున్సిపల్ కార్యాలయం వద్ద వర్షపు నీరు నిలవడంతో ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారు. కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించడం లేదని, నిర్వహణ లోపం వల్ల సమస్య ఉందని పురవాసులు చెబుతున్నారు. సమస్య తలెత్తకుండా నివారణ చర్యలు చేపట్టాలని అధికారులను కోరుతున్నారు. **ఎమ్మిగనూరు** పట్టణంలో భారీ వర్షం కురిసింది. భారీ వర్షానికి పట్టణంలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. రోడ్లపై రెండు అడుగుల నుంచి ఐదు అడుగుల వరకు నీరు ఎక్కి పారింది. దాదాపు 45 నిమిషాల వర్షానికి పట్టణంలోని మురుగుకాలువలు వర్షపు నీరు నిండిపోవడంతో రోడ్లపై భారీగా నీరు చేరింది. పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అలాగే లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు కూడా ఇబ్బంది పడ్డారు.

ఆదోనిలో జలమయమైన ప్రాంతం

ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలి

- విద్యుత్ భవన్ ముందు సిపిఎం నిరసన

ప్రజాశక్తి - ఆదోని

విద్యుత్ వినియోగదారులపై ఇంధన సర్దుబాటు, ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆదోని విద్యుత్ భవన్ ముందు నిరసన చేపట్టారు. సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు గోపాల్, తిప్పన్న ఆధ్వర్యంలో విద్యుత్ కార్యాలయం ఇన్‌ఛార్జీ టెక్నికల్ ఎఇ విజయరత్నం రాజుకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత వైసిపి ప్రభుత్వం విద్యుత్ చార్జీలను భారీగా పెంచిందని, ప్రతిపక్షంలో ఉన్న టిడిపి బాదుడే బాదుడు పేరుతో విమర్శించిందని గుర్తు చేశారు. సర్దుబాటు పేరుతో రూ.20 వేల కోట్ల భారాన్ని ప్రజలపై వేయడం దారుణమని విమర్శించారు. ఎప్పుడో వాడిన విద్యుత్‌కు అప్పుడే బిల్లు చెల్లించినా ఇప్పుడు మళ్లీ కట్టాల్సిందేనన్న ట్రూ అప్ చార్జీల పద్ధతిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో మోపిన చార్జీలను ఉపసంహరించుకుంటూ రెగ్యులేటరీ కమిషన్‌కు తెలియజేయాలని కోరారు. లేకపోతే సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యుడు ముక్కన్న, పట్టణ కమిటీ సభ్యులు నాగరాజు, వీరేష్, కృష్ణమూర్తి, అజీంఖాన్, హరి ఉన్నారు. **ఎమ్మిగనూరు** విద్యుత్ సబ్ స్టేషన్ ముందు ధర్నా నిర్వహించారు. సిపిఎం నాయకులు పి.గోవిందు, బి.రాముడు, ఎ.సురేష్ మాట్లాడారు. అనంతరం విద్యుత్ అధికారి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌కు వినతిపత్రం అందజేశారు. సిఐటియు నాయకులు రమేష్, డివైఎఫ్ఐ పట్టణ ఉపాధ్యక్షులు రవి, చేనేత కార్మిక సంఘం పట్టణ కార్యదర్శి కాశప్ప, సిపిఎం కార్యకర్తలు నామాల రాముడు, పరమేష్, మాబు హుస్సేన్, బజారి పాల్గొన్నారు.

ఆదోనిలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఎమ్మిగనూరులో వినతి పత్రం అందిస్తున్న నాయకులు

రీసర్వే సమస్యలు పరిష్కరిస్తాం

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి - హొళగుంద

భూమి రీసర్వే సమస్యలు, అభ్యంతరాలుంటే పరిష్కరిస్తామని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. శుక్రవారం మండలంలోని ఇంగల్‌దహాల్ గ్రామంలో భూ రీసర్వే అభ్యంతరాలపై గ్రామసభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ మాట్లాడారు. భూ రీసర్వేలో జరిగిన పొరపాట్లు, అభ్యంతరాలు వినతి రూపంలో తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. రైతులు తమ భూమి హద్దులు, విస్తీర్ణంలో తేడాలు ఉంటే భయపడాల్సిన అవసరం లేదని చెప్పారు. ఆర్‌ఎస్‌ఆర్ రిజిస్టర్ డాక్యుమెంట్లు వంటివి రికార్డులను పరిశీలించి న్యాయం చేస్తామన్నారు. ఎవరూ ఆందోళన చెందవద్దని తెలిపారు. రీసర్వే వల్ల ఏ రైతు కూడా ఇబ్బంది పడకూడదని ఉద్దేశంతో ప్రభుత్వం గ్రామసభ ద్వారా పరిష్కరించాలని సూచించారు. ప్రతి రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి ప్రతి రైతుకూ న్యాయం చేస్తామని తెలిపారు. తహశీల్దార్ సతీష్, రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ ముకుందరావు, విఆర్‌ఒలు ప్రహ్లాద, నాగరాజు పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు (రూరల్)** మండలంలోని బనవాసి గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ మాట్లాడారు. పంచాయతీలో ఉన్న ప్రభుత్వ భూములను, డిస్‌ప్యూట్‌లో ఉన్న భూముల వివరాలు కావాలని తహశీల్దార్ శేషఫణిని ఆదేశించారు. అర్జీలు స్వీకరిస్తున్న డివిజనల్ సర్వేయర్, సచివాలయ సర్వేయర్లు, విఆర్‌ఒల దగ్గరికి వెళ్లి పరిశీలించారు. సచివాలయ సర్వేయర్ విజయకుమార్ చేసిన అక్రమాలపై గ్రామ రైతులు అశోక్ కుమార్, రాముడు సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. డివిజనల్ సర్వేయర్ శ్రీనివాసరాజు, డిప్యూటీ తహశీల్దార్ జ్యోతి పాల్గొన్నారు. **ఆలూరు** మండలంలోని ఎ.గోనేహాళ్ గ్రామంలో గ్రామ సభలో రైతులు భూసమస్యలను తహశీల్దార్ గోవిందు సింగ్ దృష్టికి తీసుకొచ్చారు. తాము కొన్న భూములకు రిజిస్ట్రేషన్, చలాన రూపంలో ప్రభుత్వానికి డబ్బు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకున్నామని, గత ప్రభుత్వంలో చేపట్టిన రీ సర్వేలో 5 సెంట్ల నుంచి 50 సెంట్ల వరకు తక్కువ చూపించి 'మీకు ఇంతే ఉండేది' అని జగన్ బొమ్మతో ఉన్న పాస్ పుస్తకాలు జారీ చేశారని రైతులు తహశీల్దార్‌కు విన్నవించారు. ఇప్పటికైనా తమ భూములు తమకు ఆన్‌లైన్‌లో ఎక్కించి రాజ ముద్ర ఉన్న పాస్ పుస్తకాలు అందించాలని కోరారు. పాస్ పుస్తకాల కోసం రెండు, పాస్ పుస్తకాల కంటే ఆన్ లైన్ లో భూమి తక్కువగా చూపిస్తోందని 27 ఫిర్యాదులు అందజేసినట్లు తహశీల్దార్ తెలిపారు. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తూ, పరిష్కరించలేని సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని వివరించారు. విఆర్‌ఒ రవి కుమార్, మండల సర్వేయర్ అరుణ జ్యోతి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **కౌతాళం** మండలం గోతులదొడ్డి గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. తహశీల్దార్ మల్లికార్జున స్వామి, టిడిపి సీనియర్ నాయకులు ఉలిగయ్య మాట్లాడారు. భూసమస్యలు ఉన్న రైతులు గ్రామసభల్లో రెవెన్యూ అధికారులకు అర్జీలు ఇవ్వాలని కోరారు. నాయకులు అడివప్ప గౌడ్, సతీష్ నాయుడు, ఎంపిడిఒ సుబ్బరాజు, డిప్యూటీ తహశీల్దార్ రజనీకాంత్, మండల సర్వేయర్ బసవరాజు పాల్గొన్నారు. **ఆదోని (రూరల్)** మండలంలోని నారాయణపురం గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. తహశీల్దార్ శివరాముడు, రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ పెద్దయ్య, సర్పంచి అల్లమ్మ గారి సరళమ్మ, ఎంపిటిసి కర్రెప్ప, విఆర్‌ఒ రమేష్ పాల్గొన్నారు. **గోనెగండ్ల** మండలంలోని ఎర్రబాడు గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. తహశీల్దార్ కుమారస్వామి మాట్లాడారు. 19న హెచ్.కైరవాడి గ్రామంలో గ్రామసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. డిప్యూటీ తహశీల్దార్ శిరీష, ఆర్‌ఐ జనార్ధన రావు, విఆర్‌ఒ వెంకటేశ్వర రెడ్డి, సర్వేయర్ వీరేంద్ర పాల్గొన్నారు. **మంత్రాలయం** మండలం కాచాపురంలో గ్రామసభ నిర్వహించారు. తహశీల్దార్ ఎస్.రవి, ఆర్‌ఐ ఆదాం, మండల సర్వేయర్ అశోక్, విఆర్‌ఒ, పుష్పలత, గ్రామ సర్వేయర్ ధరణి పాల్గొన్నారు.

హొళగుందలో వినతులు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్

గోనెగండ్లలో

కౌతాళంలో

ఆదోనిలో

21న 'జ్యోతిర్మయి'లో మెగా జాబ్ మేళా

- జ్యోతిర్మయి కళాశాల కరస్పాండెంట్ మురళీబాబు

ప్రజాశక్తి - ఆదోని

ఈనెల 21న ఆదోనిలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జ్యోతిర్మయి కళాశాల కరస్పాండెంట్ మురళీ బాబు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. పట్టణంలోని జ్యోతిర్మయి కళాశాలలో మెగాజాబ్ మేళాకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. పదో తరగతి, డిగ్రీ, పీజీ, ఎంబిఎ అర్హతలున్న నిరుద్యోగ యువతకు ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హీరో, పేటిఎం, డిక్సాన్, భారత్ ఎఫ్1హెచ్, బ్లూ స్టార్ తదితర 20కిపైగా నేషనల్, మల్టీనేషనల్ కంపెనీల్లో టెక్నికల్, నాన్ టెక్నికల్ ఉద్యోగాల నియామకం కోసం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. ఆదోనిలో రాంజల రోడ్డులో ఉన్న డాక్టర్ జ్యోతిర్మయి డిగ్రీ కళాశాలలో ఈనెల 21న ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. ఇంటర్వ్యూ కోసం అభ్యర్థులు అర్హతల సర్టిఫికెట్లు, రెజ్యూమ్ తీసుకు రావాలని సూచించారు. పూర్తి వివరాల కోసం 9866278735 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు

ప్రజాశక్తి - మంత్రాలయం

రాష్ట్రస్థాయి ఎస్‌జిఎఫ్ వాలీబాల్ పోటీలకు తమ పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికయినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు హంపయ్య తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. కర్నూలు అవుట్‌డోర్ స్టేడియంలో ఎస్‌జిఎఫ్ అండర్-14, అండర్-17 వాలీబాల్ ఎంపిక పోటీలు జరిగాయని తెలిపారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభను చూపి స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి అండర్-14 విభాగంలో టి.సోమేష్, అండర్-17 విభాగంలో కె.చరణ్ ఎంపికయ్యారని చెప్పారు. వ్యాయామ ఉపాధ్యాయులు బసవరాజు, నరసింహరాజును అభినందించారు.

ఎంపికయిన విద్యార్థులు

పెద్దహరివాణం గ్రామాన్ని అభివృద్ధి చేస్తాం

- ఎమ్మెల్యే పార్థసారథి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పెద్దహరివాణం గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని ఎమ్మెల్యే పార్థసారథి తెలిపారు. శుక్రవారం గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి, ప్రతి వీధికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం 'పల్లె పండగ' వారోత్సవాల్లో భాగంగా సర్పంచి రాము అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో పాల్గొని మాట్లాడారు. ఉపాధి హామీ చట్టం కింద రూ.15 లక్షలతో సిసి రోడ్ల పనులు ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఎన్నికల్లో తనకు పెద్దహరివాణం గ్రామం నుంచి భారీ మెజారిటీ ఇచ్చిన ప్రజలకు ఎప్పుడూ రుణపడి ఉంటానని చెప్పారు. ఎంపిడిఒ రాజేంద్రప్రసాద్, పంచాయతీ రాజ్ డిఇ రాణి, ఇన్‌ఛార్జీ ఎపిఒ కాలిక్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ మధు కృష్ణ, టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ, రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ, బిజెపి జిల్లా అధ్యక్షులు కునిగిరి నీలకంఠ, బిజెపి సీనియర్ నాయకులు విట్టా రమేష్, మాజీ ఎంపిపి పంపాపతి, జనసేన ఇన్‌ఛార్జీ మల్లప్ప, నాయకులు ఉమ్మి సలీం, ఫకృద్దీన్, ఆది నారాయణరెడ్డి, బిజెపి గ్రామ నాయకులు రంగనాథ్ రెడ్డి, కోటికి సంతోష్, మాల శేఖర్, ఇస్వి ఎస్ఐ నాగేంద్ర పాల్గొన్నారు. **కౌతాళం** మండలంలోని గోతులదొడ్డి, తిప్పలదొడ్డి గ్రామాల్లో అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. టిడిపి సీనియర్ నాయకులు ఉలిగయ్య మాట్లాడారు. టిడిపి నాయకులు అడివప్పగౌడ్, సతీష్ నాయుడు, హనుమప్ప, చిన్న సిద్ధయ్య, గోవిందు, శివమూర్తి, బిజెపి నాయకులు హనుమంతు, ఎంపిడిఒ సుబ్బరాజు, తహశీల్దార్ మల్లికార్జున స్వామి, ఎపిఒ మాధవ శంకర్ పాల్గొన్నారు. **దేవనకొండ** మండలం నెల్లిబండ గ్రామంలో సిసి రోడ్డుకు, గోకులం షెడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. టిడిపి, జనసేన నాయకులు మల్లికార్జున గౌడ్, ఉచ్చీరప్ప, గోకులం షెడ్డు లబ్ధిదారులు రమణమ్మ, టిడిపి నాయకులు, మాజీ సర్పంచి బండగట్టు సుంకన్న, జనసేన పార్టీ నాయకులు జగదీష్, గోవిందు, కె.మల్లికార్జునరెడ్డి, రంగస్వామి, ధర్మతేజ, శ్రీనివాస యాదవ్, భీమేష్, కె.రంగాచార్యులు, రాముడు పాల్గొన్నారు. **చిప్పగిరి** మండలం నేమకల్లు గ్రామంలో ఇన్‌ఛార్జీ ఎంపిడిఒ శ్రీనివాసులు, ఇఒఆర్‌డి బాలన్న ఆధ్వర్యంలో 'పల్లె పండగ' వారోత్సవాలు నిర్వహించారు. రూ.50 లక్షల ఉపాధి హామీ నిధులతో చేపట్టబోయే సిసి రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణాలకు టిడిపి మండల కన్వీనర్ లాయర్ షేక్షావలీ, తెలుగు యువత జిల్లా మాజీ అధ్యక్షులు రవి యాదవ్, టిడిపి సీనియర్ నాయకులు పాముల సన్నప్ప, లక్ష్మీ కాంత్ రెడ్డి భూమి పూజ చేశారు. మాజీ సర్పంచి సిద్ధప్ప, జనసేన నాయకులు కిరణ్, టిడిపి నాయకులు ముద్దప్ప, కేశన్న, సుంకన్న, సుధా, రోగన్న, ఫీల్డ్ అసిస్టెంట్ మారుతి, సచివాలయ అధికారులు వినోద్ కుమార్, సువర్ణ, లక్ష్మి, రాజేశ్వరి, పావని పాల్గొన్నారు. **హొళగుంద** మండలం గజ్జెహళ్లి పంచాయతీలో 'పల్లె పండగ' నిర్వహించారు. టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్ ఆదేశాల మేరకు సిసి రోడ్డుకు భూమిపూజ చేశారు. పంచాయతీ సెక్రటరీ రంగస్వామి, గజ్జెహళ్లి సర్పంచి ఎ.నాగమ్మ, బిజెపి కిసాన్ మోర్చా జిల్లా జనరల్ సెక్రటరీ సి.రామలింగ, ఉప సర్పంచి అశోక్, పిఆర్ ఎఇ యమునప్ప, ఎపిఒ భక్త వత్సలం, ఈసీ సురేష్, ఉపాధి టిఎ శ్రీనివాసులు, ఎస్ఎ.రంజాన్, సర్పంచి తనయుడు గిరిమల, పూజారి రామలింగ, నాగిరెడ్డి, డీలర్ బికె.పంపా, దాసరి రామ, రంగప్ప, హైస్కూల్ ఛైర్మన్ కురువ శేషప్ప, ముల్లా నబీరసూల్, రఘు, తాయప్ప, అనిల్ స్వామి, నాగరాజు స్వామి, గాది, పింజరి శేషు పాల్గొన్నారు. **పెద్దకడబూరు** మండలంలోని తారాపురం, రంగాపురం, చిన్నకడబూరు, మేకడోణ గ్రామాల్లో 'పల్లె పండగ' నిర్వహించారు. తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంత రెడ్డి, నియోజకవర్గ నాయకులు రామకృష్ణా రెడ్డి పాల్గొని సిసి రోడ్ల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. టిడిపి మండల కన్వీనర్ బసలదొడ్డి ఈరన్న, నాయకులు మల్లికార్జున, విజయ్ కుమార్, వీరేష్ గౌడ్, అంజినయ్య, చిన్నకడబూరు నరసన్న, లక్ష్మన్న, మేకడోణ రాఘవ రెడ్డి, హజరత్ వలీ పాల్గొన్నారు. **ఆస్పరి** మండలంలోని ముత్తుకూరు, పుట్టకల మర్రి, బిలేకల్లు గ్రామాల్లో 'పల్లె పండగ' నిర్వహించారు. ఎంపిడిఒ గీతావాణితో కలిసి మాజీ సర్పంచి కృష్ణారెడ్డి, హరి సిసి రోడ్లు, గోకులం షెడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ముత్తుకూరు గ్రామానికి ఒక సిసి రోడ్డుకు రూ.5 లక్షలు, గోకులం షెడ్డుకు రూ.2.30 లక్షలు, పుట్టకలమర్రిలో సిసి రోడ్డుకు రూ.5 లక్షలు, గోకులం షెడ్డుకు రూ.2.30 లక్షలు, బిలేకల్లులో సిసి రోడ్డుకు రూ.5 లక్షలు, గోకులం షెడ్డుకు రూ.2.30 లక్షలతో భూమి పూజ చేశారు. సర్పంచి తోయజాక్షప్ప, ఎపిఒ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు జంప్లా నాయక్, వేణుగోపాల్, టెక్నికల్ అసిస్టెంట్లు ప్రభాకర్, నాగన్న, కాశన్న, ఖాజా హుస్సేన్, దేవేంద్ర పాల్గొన్నారు. **దేవనకొండ** మండలంలోని కప్పట్రాళ్ల గ్రామంలో 'పల్లె పండగ' నిర్వహించారు. టిడిపి సీనియర్ నాయకులు కప్పట్రాళ్ల మల్లికార్జున, సర్పంచి చెన్నమనాయుడు సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. పంచాయతీ కార్యదర్శి నాగార్జున, నాయకులు చింతమాను రవికుమార్, లాలప్ప, చింపిరన్న, ఎర్రమల, లింగన్న పాల్గొన్నారు.

భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

చిప్పగిరి

కౌతాళం

పెద్దకడబూరు

ఆస్పరి

రిలయన్స్ స్మార్ట్ బజార్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని నారాయణ జూనియర్ కళాశాల వద్ద నూతనంగా రిలయన్స్ స్మార్ట్ బజార్‌ను వైసిపి సీనియర్ నాయకులు, వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ వై.రుద్ర గౌడ్ శుక్రవారం ప్రారంభించారు. శక్తి, నరసింహ, నిర్వాహకులు వై.గౌడప్ప గౌడ్, వైసిపి యూత్ నాయకులు కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

రిలయన్స్ మార్ట్‌ను ప్రారంభిస్తున్న రుద్రగౌడ్

మధ్యంతర భృతి ప్రకటించాలి

- ఎస్‌టియు రాష్ట్ర కౌన్సిలర్ మహదేవప్ప

ప్రజాశక్తి - ఆదోని

ఉద్యోగ, ఉపాధ్యాయులకు మధ్యంతర భృతి 30 శాతం ప్రకటించాలని ఎస్‌టియు రాష్ట్ర కౌన్సిలర్, రాష్ట్ర అకాడమిక్ కమిటీ సభ్యులు మహదేవప్ప కోరారు. శుక్రవారం ఆదోనిలోని ఆర్‌జి నగర్‌లో సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షులు చింతకుంట రామకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 12వ పిఆర్‌సిలో భాగంగా ఇంతవరకు కమిషన్‌ను నియమించకపోవడం, ఉద్యోగ, ఉపాధ్యాయ ఆర్థిక ప్రయోజనాలపై ప్రకటన చేయకపోవడం శోచనీయమన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు 12వ పిఆర్‌సిలో భాగంగా మధ్యంతర భృతిని 30 శాతం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎస్‌టియు జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి ఎంసి.సుంకన్న, ఎస్‌టియు జిల్లా కార్యదర్శి బి.గోపాల్, ఎస్‌టియు ఆర్థిక కమిటీ సభ్యులు బి.రామాంజనేయులు, సీనియర్ నాయకులు బి.సత్యన్న, ఆదోని మండల ప్రధాన కార్యదర్శి బి.సుధాకర్ బాబు, సీనియర్ నాయకులు వీరప్ప, కార్యకర్తలు ఆర్‌బి.వెంకటేశులు, వి.రామాంజనేయులు, కౌతాళం మండల నాయకులు పి.అంజనయ్య, కె.లక్ష్మన్న, ఎస్.రాజా నాయక్, జి.కోటేశ్వరయ్య పాల్గొన్నారు.

IN THE COURT OF PRINCIPAL JUNIOR CIVIL JUDGE : DHONE
OS.No.521/2023
Andhra pragathi Grameena Bank Rep by its Manager, Veldurthi. ...Plaintiff
Vs
J. వీరారెడ్డి చనిపోయినందున
ఇతని వారసులు
1) బట్టు అనంతమ్మ
భర్త J. వీరారెడ్డి
గుంటుపల్లి గ్రామం,
వెల్దుర్తి మండలం,
కర్నూలు జిల్లా. ...ప్రతివాది నెం.1
ప్రతివాది సమన్స్
పై దావాను బ్యాంకు వారు late veera Reddy crop loan వసూలు కోసం దావా దాఖలు చేసినారు. నీవు వారసురాలుగా ఉండి, కోర్టు సమన్స్ తీసుకొనక తప్పించుక తిరుగుతున్నావు. కావున పై కోర్టు నందు 04-11-2024వ తేదిన ఉ॥ 10-30 గంటలకు నీవు కాని నీ తరుపున వకీలు కాని హాజరై ఆక్షేపణలు ఉన్న యడల తెలుపుకోవచ్చును. లేనంతట నీ పరోక్షమందు తీర్మాణించబడును.
(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)
వాయిదా తేది : 04-11-2024
M.Gopal Reddy,
B.com B.L.,
Advocate,
Dhone, Nandyal Dist.
Cell : 9440557898

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE : KURNOOL.
OS.No.166/2023
B.NARASIMHULU S/o B.SUNKANNA
AGE 60 YEARS, HINDU, ADVOCATE,
H.No.62/26, KURNOOL VILLAGE,
KURNOOL MANDAL, KURNOOL DIST. A.P.
...PLAINTIFF
VS
V.RAMAKRIHNUDU S/O HANAMANNA,
AGED ABOUT 50 YEARS, HINDU,
BUSINESS, H.NO.76/111-46-2A-4,
RAGHAVENDRA NAGAR,
NEAR BELLARY CHOWRASTA,
KURNOOL VILLAGE,
KURNOOL MANDAL, KURNOOL DIST. A.P.
...DEFENDANT
SUMMONS TO DEFENDANT
పై నెంబరు కేసులో వాది తనకు రావలసిన దావా మొత్తమును రూ.3,14,666-00 ముందు వడ్డ వగైరాలు రాబట్టుకొనుటకు గాను, నీపై దావా దాఖలు చేసియున్నాడు. నీకు ఎలాంటి అభ్యంతరములు వున్నచో పై కోర్టు ఎదుట 13-11-2024వ తేదీన ఉదయం 10.30 గంటలకు నీవుగాని, నీతరపు న్యాయవాది ద్వారా గాని హాజరై తెలుపుకోవలెను. లేనిచో నీ పరోక్షమందు తీర్మానించ బడును.
(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)
T. NAGABHUSHANA NAIDU,
అర్జీదారు అడ్వకేటు, కర్నూలు.
సెల్ : 9440361293

మహారాజశ్రీ రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు
(జూనియర్ డివిజన్) = ఆదోని
O.S.No. 342/2023
Between:
సయ్యద్ మహమ్మద్ నాసిర్
S/O MD. గౌస్, ఆదోని. ...వాది
V/s.
మాదిగ చంద్రన్న. ...ప్రతివాది
ప్రతివాదికి దావా సమను
To
మాదిగ చంద్రన్న S/o మాదిగ చౌడప్ప (Defendant)
R/o ఇంటి నెం.2/93/3, ఎస్.సి. కాలని,
అలసందగుత్తి గ్రామం, బసరకోడు పోస్ట్,
ఆదోని మండలం, కర్నూలు జిల్లా.
పై తెలిపిన వాది, ప్రతివాది అయిన మీపైన పై కోర్టులో ప్రామిసరినోటు బాపతు వసూలు నిమిత్తం దావా దాఖలు చేసియున్నారు. పై కోర్టు నుండి ప్రతివాది అయిన నీకు చాలా సార్లు సమన్లు పంపిననూ తీసుకోనందున కోర్టు వారి ఆదేశాల మేరకు ఈ పత్రికా ప్రకటన ద్వారా తెలియజేయడమేమనగా పై దావా తేది: 05-11-2024 ఉదయం 10.30 గంటలకు ప్రతివాది అయిన నీవు కోర్టుకు హాజరు కావలెనని, నీ తరఫున ఏమైనా ఆక్షేపణలు వున్నయెడల నీవు ఖుద్దుగా గాని, నీ వకీలు ద్వారా గాని కోర్టుకు హాజరై మీ అభ్యంతరాలను తెలుపవచ్చును. ప్రతివాది అయిన నీవు హాజరు కాని యెడల పై కోర్టు వారు పై కేసులో వాది పరముగా నీ పరోక్షమున తీర్మానము వేయుదురని ఈ పత్రికా ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.
// కోర్టు వారి ఆర్డరు మేరకు //
వాయిదా తేదీ : 05-11-2024
శ్రీ ఎ. వేణుగోపాల్,
శ్రీ ఆర్. రవిస్వామి,
శ్రీ జి.బాలకృష్ణ
వాది తరపు వకీళ్లు,
ఆదోని - 518301.
Cell No. 9440232527

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE COURT:: ADONI
S.O.P. No. 11/2024
Between :
1. Achukatla Rahamath Bee
2. Achukatla Shahara Banu
3. Achukatla Afrin Banu
4. Achukatla Khaja Banu
5. Achukatla Baba Fakruddin
6. Achukatla Shadiq Basha. ...Petitioners
-V/s-
Sub Post Master, Pattikonda. ...Respondent
Paper Publication filed on behalf of the Petitioners
ఇందుమూలంగా యావన్మందికి తెలియ జేయడం ఏమనగా నా క్లైంట్లు అయిన 1. అచ్చుకట్ల రహమత్ బీ, 2. అచ్చుకట్ల సహరా బాను, 3. అచ్చుకట్ల అఫ్రీన్ బాను, 4. అచ్చుకట్ల ఖాజా భాను, 5. అచ్చుకట్ల బాబా ఫకృద్దీన్ మరియు 6.అచ్చుకట్ల సాదిక్ బాషాలు ఇందులో మొదటి పిటిషనర్ కి భర్త మరియు 2వ నుండి 6వ పిటిషనర్లకు తండ్రి అయిన అచ్చుకట్ల అబ్దుల్, తండ్రి అచ్చుకట్ల గుండు సాహెబ్ గారు అయిన కర్నూలు జిల్లా, పత్తికొండ మండలం, పత్తికొండ పట్టణం పోస్టు ఆఫీసు నందు సేవింగ్స్ ఫండ్స్ కొరకు గౌరవనీయులైన సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, ఆదోని నందు సక్సెసన్ సర్టిఫికేట్ (ఎస్.ఓ.పి) కొరకు ఎస్.ఓ.పి.11/2024 దాఖలు పరిచినారు. ఇందులో ఎవరికైనా అక్షేపణలు ఉన్న యెడల 21-10-2024 సోమవారం తేదీన ఖుద్దున గాని ప్లీడరు ద్వారా గాని గౌరవ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, ఆదోని వారి ఎదుట హాజరు అయి తమరి అక్షేపణలు తెలియజేయగలరు. లేని యడల సదరు విషయంపై పరోక్షంగా విచారించి తీర్మాణం చేయుదురని తెలియజేయడం అయినది.
కోర్టువారి ఉత్తర్వుల మేరకు ప్రకటన చేయడమైనది.
ఆదోని
వాయిదా తేదిః 21-10-2024
ఎన్. క్రిష్ణయ్య,
అర్జిదారు/వాది అడ్వకేటు
పత్తికొండ/ఆదోని
సెల్ నెం.9885471917